**ఈ లోకంలోగల విభిన్న మనస్తత్వాలకూ, వింత మనుషులకు ఆలవాలమైన ఆ రైలు గాలితో జోడీ కట్టినట్టుగా జోరుగా సాగిపోతోంది. ఆ వాయువేగాన్ని సైతం ఓవర్‌టేక్ చేస్తున్నట్టుగా ఆ రైలులో ఓ కిటికీకి వారగా సింగిల్ సీట్‌లో ఒదిగొదిగి కూర్చున్న ఆ యువకుని అంతరంగం అనంతమైన దీర్ఘాలోచనలను తెరలు తెరలుగా నెమరు వేసుకుంటోంది.**

అతని ఆకృతి చూడ్డానికి అందవిహీనంగా ఉంది. ఓ మోస్తరుగా పెరిగిన గడ్డం, పీక్కుపోయిన దవడలు, లోతుగా చొచ్చుకుపోయిన కళ్ళు, నలిగిన బట్టలు అతని మానసిక స్థితికి అద్దం పడుతున్నాయి ఆ నిస్తేజమైన కళ్ళ ముందర ఏవేవో వైరాగ్యపు దృశ్యాల పరంపర.

అంతలో ఏదో స్టేషను రావటంతో బండి ఆగి చిన్నగా జర్క్ ఇవ్వటంతో ఏదో లోకంలోంచి జారిపడ్డట్టుగా స్పృహలోకి వచ్చిన ఆ యువకుడు తన తడిదేరిన కళ్లని నెమ్మదిగా కర్చీఫ్‌తో అద్దుకున్నాడు.

ఉన్నట్టుండి ఏదో అలికిడి రాగా, అసంకల్పితంగా ఆ వేపు తల తిప్పేడు. అమ్మాయిల గుంపు గలగల నవ్వులతో పెద్దగా అరుస్తూ, అతనికి సమీపంగా ఉన్న సీట్లను ఆక్రమించేశారు.

కూర్చున్న మరుక్షణమే తమ తమ నైజాల వారీగా గడగడా మాట్లాడేస్తూ, ఉన్నట్టుండి పెద్దపెట్టున ఘొల్లున నవ్వేస్తున్నారు. వారి నవ్వులతో చాలా మటుకు కృత్రిమత్వమే తొంగిచూస్తోంది.

ఆ అమ్మాయిలు సృష్టిస్తోన్న అలజడికి ఆ యువకుని ఆలోచనలకు అంతరాయం కలిగినట్టుంది. అతను ఇబ్బందిగా కదిలి, ఎప్పటికి ఆ సడలిపోని మౌనంతో కిటికీవేపు చూపు మరల్చుకుని యధాలాపంగా ఆలోచనల్లోకి కూరుకుపోయాడు.

అమ్మాయిలు తెలుగు, ఇంగ్లీషుల్లో తమకుగల భాషా పరిజ్ఞానాన్ని ప్రదర్శించుకుంటూ, తమకు తెల్సిన అన్నిరకాల జోకులను కట్‌చేస్తూ సెన్సాఫ్ హ్యూమర్‌లో నెంబర్ వన్ నేనంటే నేనే అనే స్థాయిలో పోటాపోటీగా నవ్వులతో ఆ కంపార్ట్‌మెంట్‌ని కంపింపజేస్తున్నారు.

ఆ కంపార్ట్‌మెంట్‌లోని వారంతా ఆ అమ్మాయిలకేసే ఆసక్తిగా చూస్తూ ఉండిపోయారు. అప్పటికే వారి గలగల నవ్వుల సవ్వడికి బెర్తులపై ఉన్న పురుష పుంగవులు అలారం కొట్టినట్టుగా లేచి కూర్చున్నారు. నేటి నాగరికతకి చిహ్నమనుకునే వారి డ్రెస్సుల్లోంచి ఉక్కిరిబిక్కిరవుతూ, ఉట్టిపడ్తోన్న అందాల్ని ఆమడదూరం నుంచి ఆస్వాదిస్తున్నారు.

ఆ పురుష పుంగవులు అవస్థని అప్పటికే గమనించిన ఆ నవజవ్వనులు తమ అందాల్ని జ్ఞప్తికి తెచ్చుకుని ముసిముసిగా నవ్వుకుంటున్నారు.

అన్నింటికి అతీతుడన్నట్లుగా ఆ యువకుడు కిటికీకి అంటుకుపోయి వెనక్కి పోతోన్న చెట్లను, పంట పొలాలను చూస్తున్నాడు నిర్వికారంగా.

వచ్చినప్పట్నుంచి అతడినే గమనిస్తోన్న ఓ అమ్మాయి-

'రాణీ చూశావా?! ఈ మానవుడెవరో గానీ సినిమా హీరోలా ఫోజిచ్చేస్తున్నాడు. ఎదురుగా మనమున్న విషయం గుర్తించనట్టు ఆస్కార్ అవార్డు అందుకునే స్థాయిలో భలే నటించేస్తున్నాడనుకో' అంది ఆ యువకుడ్ని యద్దేవా చేస్తూ.


ఆ గుంపుకి నాయకత్వం వహిస్తోన్న రాణి, స్నేహితురాలి మాటకి అతడిని ఆపాదమస్తకం పరిశీలనగా చూసి, నిజమేనే... నువ్వన్నట్టు హీరోలానే ఉన్నాడు. కాకపోతే మరో దేవదాసు, భగ్న ప్రేమికుడు లాంటి టైటిల్స్‌కి సరిగ్గా సూటవుతాడు పైసా మేకప్ ఖర్చు లేకుండానే...!' జోక్ కట్ చేసినట్టుగా కిసుక్కున నవ్వింది. ఆమె నవ్వుకి మిగతా అమ్మాయిలు శ్రుతి కలిపినట్టుగా ఘొల్లుమన్నారు.

ఎవరో చెర్నాకోలాతో ఛెళ్ళుమనిపించినట్లు ఉలికిపాటుగా తుళ్ళిపడ్డాడతను. వారు టీజింగ్ చేస్తోంది తననేనని గ్రహించినా, మౌనంగా ఉండిపోయాడు.

సరిగ్గా క్షణకాల తరవాత అతనికి తెలియకుండానే అతని కనుకొలకుల్లోంచి ఓ వెచ్చటి కన్నీటి బిందువు జారిపడింది. అది ఆ అమ్మాయిల కంటపడకుండా జాగ్రత్తపడ్డాడు.

ఇతరుల సొత్తుని ఆశించటం ఎంతటి హేయమో, ఇతరుల జాలిని పొందాలనుకోవడం అంతకన్నా హేయమే మరి!

అంతవరకు మబ్బులు కమ్మిన ఆకాశం అతనికి సానుభూతి ప్రకటిస్తోన్నట్టు పెద్దపులిలా గాండ్రించింది. చల్లటి ఈదురుగాలి లాలనగా అతడిని స్పృశిస్తున్న సంకేతానికి అతడి జుత్తు చెరిగిపోతోంది.




కొన్ని క్షణాల అనంతరం ఆ ఈదురుగాలి దట్టమైన జడివానగా మారిపోయింది. భోరున కుంభవృష్టి మొదలైంది.

ఆ కంపార్ట్‌మెంట్‌లోని ప్రయాణికులంతా 'టప్... టప్' మంటూ కిటికీలను మూసేస్తున్నారు.

అతను మాత్రం కిటికీని మూయక దాని ఊచలపై మొహం ఆన్చి... బైటికి చూస్తున్నాడు ఇతమిత్థంగా చెప్పలేని భావంతో.

కంపార్ట్‌మెంట్‌లో అలుముకున్న తిమిరాన్ని తరిమేందుకై విద్యుత్ దీపాలు వెలిగించారు. ఆ వెలుగులో అతని మొహంపై కొన్ని చినుకులు పడి మిలమిల మెరుస్తున్నాయి.

మెత్తవారిని చూస్తే మొత్తబుద్ధవుతున్నట్టుగా - రాణి అతనితో 'ఏ మేన్, క్లోజ్ ద విండో...' ఆదేశిస్తున్నట్టుగా అంది.

ఆ యువకుడు ఒక్కసారిగా తుళ్ళిపడి ప్రశ్నార్థకంగా రాణికేసి చూశాడు. రాణి మళ్ళీ చిరాగ్గా, ఆదేశం జారీ చేసింది.

దాని కతను అదోలా, అమాయకంగా మొహంపెట్టి, 'అది కాదండి...! కిటికీ తెరిచి ఇలా బైటకి చూట్టమంటే నాకు చాలా ఇష్టమండి...' అన్నాడు.

అంతే, రాణికి చిరాకు ముంచుకొచ్చింది. 'ఆ నీటి తుంపర్లు కంపార్ట్‌మెంట్‌లోకి ఎలా వచ్చి పడుతున్నాయో... చూశావా? ఎముకలు కొరికేసే చలి పుట్టిస్తోన్న ఈ వెధవ వాన కారణంగా మా ఆరోగ్యాలు ఏమి కావాలి? అని నొసలు చిట్లించి మండేపడేసరికి, అతని మొహం ఒక్కసారిగా మ్లానమై పోయింది. అతడు చప్పున విండోని మూసివేసి దానిపై తలవాల్చేసి నిద్రకై ఉపక్రమిస్తోన్న వాడిలా రెండు కళ్ళూ మూసుకుని, యధాలాపంగా ఆలోచనా స్రవంతిలోకి జారిపోయాడు.

రైలు అన్నింటికి అతీతంగా గమ్యమే తన తదుపరి లక్ష్యమన్నట్టుగా జోరుగా పరుగులు పెడుతోంది.

అమ్మాయిలంతా తమకు తెల్సిన రకరకాల తెలుగు, ఇంగ్లీషు, హిందీ పాటలను హుషారుగా 'హమ్' చేస్తూ లయబద్ధంగా క్లాప్స్ కొడతున్నారు.

ఏదో స్టేషనొచ్చి బండి ఆగటంతో అతను మెల్లగా, కొద్దిగా విండోని ఎత్తిపట్టి బైటకు చూశాడు. అతను దిగాల్సిన స్టేషన్ వచ్చినట్టుంది. పక్కనే భద్రపరచుకున్న చేతిసంచిని భుజానికేసుకుని నెమ్మదిగా లేచాడు.

సరిగ్గా అప్పుడే ఓ అమ్మాయి-

'లే... లే... లేలేనా రాజా...!!

లేపమంటావా... నిద్దుర లేవనంటావా...?!

పాటందుకుని, నిష్క్రమిస్తోన్న అతనికి వినబడాలన్నట్లుగా గొంతు స్థాయిని హెచ్చించింది మరింత హుషారుగా.

ఏ మాత్రం వినికిడి జ్ఞానంలేని మనిషిలా అతను ముందుకు నడిచాడు. అప్పుడే అతనికి ఎదురుపడ్డ టి.సి. ఆశ్చర్యంగా మొహంపెట్టి, 'నమస్తే మనోసాగర్‌గారు' అంటూ విష్ చేశాడు.

టి.సి.గారి నమస్కారానికి అతను అంటే - మనోసాగర్ కూడా ప్రతినమస్కారం చేశాడు చిన్నగా గొంతు పెగుల్చుకుని.

రాణికి నోట మాట రాలేదు. మనోసాగర్ రచనలు ఇదివరకే చాలా చదివింది. అందులో ప్రత్యేకించి మనోసాగర్ 'అమ్మ' నవల అంటే రాణికి చాలా ఇష్టం. మాతృత్వానికి వెల కట్టడానికి వీలులేదన్నదే అందులో సారాంశం. బిడ్డలనుంచి ఏదో ఆశించి ఏ తల్లి కష్టపడదు. తనకు ఉన్నా లేకున్నా, ఉన్న పిల్లలందరినీ సమానంగా చూస్తూ ప్రేమను పంచడం తల్లికే చెల్లు. అమ్మదనంలో ఉన్న కమ్మదనం మాటలతో వర్ణించేది కాదన్న మనోసాగర్ మాటను రాణి ఎన్నో సార్లు మననం చేసుకుంటూ ఉంటుంది. మాతృ మూర్తి ప్రేమను అమితంగా రుచి చూసి ఉంటేనే అమ్మ రచయిత అంత ఆర్ద్రంగా రాసి ఉంటారని కూడా రాణి అనుకుంటూ ఉంటుంది.

టి.సి. మనోసాగరూ రైలు దిగి ప్లాట్‌ఫారమ్ షెల్టర్ కింద కాసేపు మాట్లాడుకున్న అనంతరం మనోసాగర్ టి.సి. నుండి సెలవు తీసుకుని రైలు పక్కగా అడుగులేస్తూ నిష్క్రమిస్తున్నాడు.

కర్తవ్యోన్ముఖుడైన టి.సి. కంపార్ట్‌మెంట్‌లోకి అడుగుపెట్టగానే 'హలో అంకుల్... హౌ ఆర్ యూ?' అంటూ రాణి విష్ చేసింది. టి.సి. రాణిని అబ్బురంగా చూసి, 'పర్‌ఫెక్ట్‌లీ ఫైన్ బేబీ...! ఫ్రెండ్సందరితో బయల్దేరినట్టున్నావు. ఎక్కడికమ్మా ప్రయాణం?' పలకరించారాయన.

'అంకుల్, నా ప్రయాణం సంగతి తర్వాత చెప్తా గానీ, ఇప్పుడు మాట్లాడారే... అతను మీకు తెలుసా?' ఆసక్తిగా అడిగింది రాణి.

'ఆ... అవునమ్మా? అతితక్కువ వయస్సులో వందకు పైగా మహా కావ్యాలు రచించిన- మహాకవి మనోసాగర్... అతనేనమ్మా. ఎన్నో ఆటు పోట్ల వల్లే ఆయన రచనల్లో వాస్తవికత కనిపిస్తుంది. చుట్టూ చేరి ఆయన ద్వారా లాభపడ్డవారే కానీ కాలం కలసిరాక డీలాపడ్డప్పుడు ఆయన్ను ఆదుకున్నవారే లేరు. అతని జీవితానికి మిగిలిన ఏకైక ఆసరా వాళ్ల అమ్మ! రెండువారాల క్రిందటే ఆమె కాలం చేసింది. కన్నతల్లి స్మృతులతో అనుక్షణం కొట్టుమిట్టాడుతూ మానసికంగా కుమిలిపోతున్నారు పాపం...!' అంటూ టి.సి. చెప్పిన మాటలకి రాణి మొహం ఒక్కసారిగా వివర్ణమై పోయింది. ఆ నిజాన్ని జీర్ణించుకోడానికి ఆమెకి చాలా సమయం పట్టింది. ఆమె కళ్ళల్లో పల్చటి నీటితెర కదలాడి, మనసంతా ఆర్ద్రమై పోయింది.

గార్డు విజిల్ వేయటంతో రైలు నెమ్మదిగా ఆ స్టేషన్ని వదలడానికి కూత పెడుతోంది. రాణి మనసు కల్లోల కెరటమైంది.

రాణి టి.సి. కేసి వేడుకోలుగా చూస్తూ, 'అంకుల్... నేనిప్పుడే ఆయన్ని కలవాలి' బొంగురుపోయిన గొంతుతో నెమ్మదిగా అంది.

'ఇప్పుడా...?! ఎలా అవుతుందమ్మా? రైలు కదులుతోందిగా... అందులోనూ... ఈ పాడు వర్షమొకటి...' అనునయిస్తోన్నట్టుగా అన్నాడు టి.సి. భారంగా రైలు కదిలింది.

ఎలాగైనా దిగితీరాలి అంకుల్ అని ప్రాధేయపడింది. కుదరదని చెప్పి టి.సి. ముందుకు వెళ్లిపోయాడు.

చైన్ లాగి రాణి కిందికి దిగడం, ప్లాట్ ఫాం వైపు పరుగులు తీయడం, జనం నిస్తుపోయి చూస్తూ ఉండడం ఒకటొకటిగా జరిగిపోయాయి.

రాణి వైపు అందరూ విచిత్రంగా చూస్తూ ఉండడంతో టి.సి.కి జరిగిందేమిటో అర్థమైపోయింది. స్టేషన్ దాటి వెళుతోన్న మనోసాగర్‌ను మొత్తంమీద రాణి పట్టుకోగలిగింది. ఆయనకు ఎదురుగా నిలబడి నమస్కారమండీ- నేను మీరచనలు చాలా చదివాను- మీ అభిమానిని. మీ రచన అమ్మ చాలా సార్లు చదివాను. ఇందాకా రైల్లో మిమ్మల్ని అవమానించాను. ఇప్పుడే టి.సి. గారు మీరు ఫలానా అని చెప్పారు. అందుకే మిమ్మల్ని కలవాలని ట్రెయిన్ చైన్ లాగి మరీ వచ్చాను. క్షమించండి- నేనన్న మాటలకు- అంటూ రాణి ఏదో చెప్పుకుంటూ వెళుతోంది.

మనోసాగర్ ఆ మాటలను పట్టించుకోనే లేదు. నా రచన అమ్మ వీడని జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఇప్పుడు ఏ స్త్రీని చూసినా మా అమ్మే గుర్తుకు వస్తోంది. ఇందాకా మీరు అల్లరి చేసినపుడు మీలో అమ్మను తప్ప అల్లరి పిల్లను చూడలేదు. మా అమ్మే నాతో ఆడుకుంటోందనుకున్నాను. తడిసిపోతున్నావు. రైలెక్కమ్మా జనమంతా నీకోసమే ఎదురుచూస్తున్నారు... అంటూ చీకట్లో కలిసిపోయాడు మనోసాగర్.

★